

సీ, డీ గ్రేడ్ ఉద్యోగులకు తీపి కబురు

● 20 శాతం దీపావళి బోనస్



చెన్నై, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న సీ, డీ గ్రేడ్ ఉద్యోగులకు, సిబ్బందికి ఎక్స్‌గ్రేషియాతో కూడిన 20 శాతం గరిష్ఠ బోనస్‌ను చెల్లించనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సవరించిన బోనస్ చట్టం 2015 ప్రకారం అదనపు వేతనానికి అర్హత కలిగిన గరిష్ఠ వేతనం రూ.21,000లుగాను, అదే విధంగా కనీస వేతనం రూ.7000 గాను ఉన్న పరిమితులను సడలించి 2024- 25 సంవత్సరానికి సీ, డీ కేటగిరీ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు బోనస్, ఎక్స్‌గ్రేషియాను చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. ఆ ప్రకారం లాభాల బాటలో పయనిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న సీ, డీ గ్రేడ్ కార్మికులు ఉద్యోగులు ఆయా సంస్థలు కేటాయించే 8.33 శాతం బోనస్‌తోపాటు 11.67 శాతం ఎక్స్‌గ్రేషియాను కలిపి మొత్తం 20 శాతం బోనస్ చెల్లిస్తారని పేర్కొన్నారు. విద్యుత్‌బోర్డు, రవాణా సంస్థలు, ప్రజాపంపిణీ శాఖ, సంస్థలు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలలో పనిచేసే సీ, డీ కేటగిరీ కార్మికులు, సిబ్బంది, ఉద్యోగులకు ఈ తరహాలోనే 20 శాతం బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. లాభాలు ఆర్జించని ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే సీ, డీ గ్రేడ్ కార్మికులు, సిబ్బందికి 8.33 శాతం బోనస్‌తోపాటు 1.67 శాతం ఎక్స్‌గ్రేషియాను కలిపి మొత్తం 10 శాతం బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ, చెన్నై మెట్రోవాటర్ సప్లయ్ బోర్డులో పనిచేసే వారికి కూడా ఈ రీతిలో 10 శాతం బోనస్ చెల్లిస్తారని పేర్కొన్నారు. నీటి సరఫరా సంస్థలలో పనిచేసేవారికి 8.33 శాతం బోనస్ మాత్రమే చెల్లించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజాపంపిణీ సంస్థల్లో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికులకు రూ.3000లను ఎక్స్‌గ్రేషియాగా అందజేస్తామన్నారు. 20 శాతం బోనస్ ప్రకారం పర్మనెంట్ ఉద్యోగులు, సిబ్బంది కనిష్ఠంగా రూ.8400లు, గరిష్ఠంగా రూ.16,800ను పొందుతారని స్టాలిన్ ఆ ప్రకటనలో వివరించారు.

అబ్బుర పరచిన నేవీ మాక్ డ్రిల్ 7

దీపావళి పండుగ సందర్భంగా 20,378 ప్రత్యేక బస్సులు

అఖిల భారత కోటాలో అదనంగా 138 ఎంబీబీఎస్ సీట్లు 6



రాందాస్‌ను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

రాందాస్‌కు అస్వస్థత

● ఆస్పత్రిలో చేరిక ● సీఎం స్టాలిన్, ఈపీఎస్ పరామర్శ

● పరామర్శకు వచ్చిన అన్బుమణికి 'నో ఎంట్రీ'

చెన్నై, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా పార్టీలో వారసత్వ పోరుతో సతమతమైపోతున్న 'పాట్టాలి మక్కల్ కట్చి' (పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ సోమవారం అస్వస్థతకు గురయ్యారు. కుటుంబీకులు ఆయన్ని అపోలో ఆస్పత్రిలో చేర్పించగా, వైద్యులు అత్యవసర విభాగంలో చికిత్సలందిస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పీఎంకే శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. దీంతో ఆస్పత్రి ఓ ప్రకటన జారీ చేసింది. వైద్యపరీక్షల కోసమే రాందాస్ ఆస్పత్రిలో చేరారని, ఆయనకు సీనియర్ కార్డియాలజిస్ట్ జి.సెంగుట్టువేల్ ఆధ్వర్యంలో వైద్యులు తగు పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అన్ని పరీక్షలు పూర్తయిన తర్వాత రెండు రోజుల్లో ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేస్తామని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

అన్బుమణికి 'నో ఎంట్రీ'.. పరామర్శించిన స్టాలిన్

రాందాస్ ఆస్పత్రిలో చేరిన కొద్దిసేపటికి ఆయన కుమారుడు డాక్టర్ అన్బుమణి అక్కడికి చేరుకున్నారు. అయితే ఆయన తండ్రిని పరామర్శించకుండానే వైద్యులతో మాట్లాడి వెనుదిరిగారు. ఆస్పత్రి వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. రాందాస్ అత్యవసర చికిత్సా విభాగంలో చికిత్సలందుకుంటున్నందున నేరుగా ఆయన్ని చూడలేకపోయానన్నారు. ఆరోగ్య పరిస్థితులు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నానని చెప్పారు. అయితే అన్బుమణిని చూసేందుకు రాందాస్ ససేమిరా అన్నట్లు తెలిసింది. అందుకే తండ్రిని చూడకుండానే వెనుదిరిగినట్లు సమాచారం. కాగా అన్బుమణి వెళ్లిన కొద్దిసేపటికే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆస్పత్రికి చేరుకున్నారు. రాందాస్‌ను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాందాస్ భావోద్వేగానికి గురై.. స్టాలిన్ చేతులు పట్టుకుని ఆత్మీయంగా మాట్లాడారు. స్టాలిన్ వెంట మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు కూడా ఉన్నారు. కాగా ప్రతిపక్ష నేత, అన్నాడీఎంకే కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కూడా రాందాస్‌ను పరామర్శించారు.

మారుమూల పల్లెలకూ

నాణ్యమైన వైద్య సేవలు

● సీఎం స్టాలిన్

● రూ.173.81 కోట్లతో ఆస్పత్రి భవనాల ప్రారంభం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆస్పత్రి భవనాలను ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్



చెన్నై, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మారుమూల పల్లెల్లో నివసిస్తున్నవారికి నాణ్యమైన వైద్యసేవలందించడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. సచివాలయంలో వైద్య, ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో రూ.173.81 కోట్లతో నిర్మించిన ఆస్పత్రులు, వైద్యసంబంధిత భవనాలను సోమవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రారంభించారు. అదే సమయంలో రూ.20.15 కోట్లతో నిర్మించనున్న వైద్య భవనాలకు శంకుస్థాపన చేశారు. తంజావూరు, సేలం, పాళయంకోటలోని ప్రయోగశాలల్లో రూ.24 కోట్లతో అమర్చిన యాంత్ర పరికరాలను ప్రారంభించారు. కాట్పాడి, పళని, తిరుపత్తూరు, గూడలూరు జిల్లా ఆస్పత్రుల్లో, శంకరాపురం ఆస్పత్రి, మేలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.108.50 కోట్లతో నిర్మించిన అదనపు భవనాలు, తెన్‌కాశి, తిరుపత్తూరు, కళ్ళకురిచ్చి, మైలాడుదురై, మదురై, తిరునల్వేలి, తంజావూరుల్లో రూ.42 కోట్లతో నిర్మించిన 7 జిల్లా స్థాయి మందుల గోదాములను ప్రారంభించారు. స్థానిక తేనాంపేట డీఎంఎస్ ప్రాంగణంలో రూ.14.85 కోట్లతో ఆరు అంతస్థులతో నిర్మించిన కొత్త కార్యాలయ భవనాన్ని, కాంచీపురం జిల్లా ఊత్తుకాడులో రూ.75 లక్షలతో నిర్మించిన అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. ఇదే విధంగా భారతీయ వైద్యం, హోమియోపతి సంస్థ ఆధ్వర్యంలో రూ.6.22 కోట్లతో నిర్మించిన అన్నూరు, కలాంపాళయం, తిరుప్పూరు జిల్లా పల్లడం, మదురై జిల్లా అలంగానల్లూరు, తిరువణ్ణామలై జిల్లా కారైకుడిలో సిద్ధా విభాగం భవనాలు, మదురై జిల్లా మేలక్కాల్‌లో ఆయుర్వేద విభాగ భవనం, చెన్నై అరుంబాక్కం ప్రభుత్వ సిద్ధ వైద్య కళాశాలలో అదనపు భవనం, విద్యార్థినులకు అదనపు హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఈవీ వేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్ మురుగానందం, వైద్య ప్రజారోగ్య శాఖల ముఖ్య కార్యదర్శి పి.సెంథిల్‌కుమార్, మందుల నియంత్రణ సంచాలకుడు ఆర్ లాల్‌వేనా, జాతీయ ఆరోగ్య కమిటీ సంచాలకుడు అరుణ్ తంబురాజ్, భారతీయ వైద్యం, హోమియోపతి సంచాలకురాలు ఎం.వి జయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అందరికీ మెరుగైన వైద్యం అందించాలన్న పట్టుదలతో తమ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.

హాస్టల్, స్కూలు భవనాల ప్రారంభం...

సచివాలయంలో ఆదిద్రావిడుల, గిరిజనుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన మరో కార్యక్రమంలో రూ.209.18 కోట్లతో నిర్మించిన 20 వసతిగృహాలు, 37 పాఠశాల భవనాలు, 250 నివాసగృహాలు, 16 గ్రామస్థాయి మేధోపరిజ్ఞాన కేంద్రాలు, 9 బహుళార్థక సాధక కేంద్రాలను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ శాఖ ఆధ్వర్యంలోనే సచివాలయంలో వెలుపల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెసిడెన్షియల్ స్కూళ్లలో బసచేస్తున్న ఆదిద్రావిడ, గిరిజన విద్యార్థుల కోసం రూ.3.62 కోట్లతో కొనుగోలు చేసిన వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. గిరిజనులకు అత్యవసర వైద్యసేవలందించడానికి రూ.5.78 కోట్లతో కొనుగోలు చేసిన 25 అంబులెన్స్‌లకు ప్రారంభించారు. మంత్రులు మదివేందన్, ఈవీ వేలు, ఆద్రిదావిడుల గిరిజనుల సంక్షేమ శాఖ కార్యదర్శి కె.లక్ష్మీప్రియ, టాడ్కో చైర్మన్ ఇళయరాజా, ఆదిద్రావిడుల సంక్షేమ సంచాలకుడు డి.ఆనంద్, టాడ్కో మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ కందసామి తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే వైపు విజయ్ చూపు!

● పొత్తుపై రహస్య మంతనాలు?



చెన్నై, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాట ఘటనతో తీవ్రంగా నష్టపోయిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే).. నష్టనివారణ చర్యలకు దిగిందా?.. అధికార డీఎంకేను ఒంటరిగా అడ్డుకోవడం కష్టసాధ్యంగా మారడంతో.. అన్నాడీఎంకేతో చేతులు కలిపేందుకు సిద్ధమైందా?.. ఆ పార్టీ అధినేత విజయ్ ఆదేశాల మేరకు క్రియాశీలక నేతలు.. అన్నాడీఎంకేతో మంతనాలు సాగిస్తున్నారా?.. అవుననే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ రాజకీయ వర్గాలు.

రెండేళ్ల క్రితం పార్టీని ప్రారంభించిన విజయ్.. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కదనోత్సాహంతో సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వారానికి రెండురోజులు జిల్లా కేంద్రాల్లో బస్సు ప్రచారం చేపడుతున్నారు. అధికార డీఎంకేపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కరూర్ ప్రచారం సందర్భంగా తొక్కిసలాట జరిగి.. 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో పోలీసుల అరెస్టుకు భయపడి పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ సహా ప్రముఖులంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోవటంతో ఆ పార్టీ డైలమాలో పడిపోయింది. కరూర్ దుర్ఘటనపై డీఎంకే తీవ్రంగా స్పందించకపోయినా ఆ ఘటనకు బాధ్యులు ఆ పార్టీయేనన్నట్లుగా విజయ్ వేలెత్తి చూపుతున్నారు. ఈ ఘటనపై నిరాధార పరస్పర ఆరోపణలకు దిగవద్దని, సంయమనం పాటించాలంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన ప్రకటన్ని సైతం విజయ్ పట్టించుకున్నట్లుగా కనిపించడం లేదు. అయితే ప్రభుత్వ యంత్రాంగం మాత్రం టీవీకేదే తప్పు అన్నట్లుగా చర్యలకు దిగింది. ఇదే సమయంలో బీజేపీ, అన్నాడీఎంకేలు విజయ్ పార్టీని సమర్థిస్తూ ప్రకటనలు చేస్తున్నాయి. అన్నాడీఎంకే అధినేత, మాజీ ఎడప్పాడి పళనిస్వామి అయితే ఈ దుర్ఘటనతో విజయ్‌కి ఎలాంటి సంబంధం లేదన్న ధోరణితో ప్రకటనలు గుప్పిస్తున్నారు. అంతేకాకుండా విజయ్‌పై ఎలాంటి విమర్శలు చేయవద్దంటూ రెండు పార్టీల నేతలకు మౌఖిక ఆదేశాలు కూడా వెళ్లినట్లు తెలిసింది. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు అన్నామలై, ఆ పార్టీ సీనియర్ నేత హెచ్. రాజా విజయ్‌కి మద్దతుగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. కరూర్ దుర్ఘటనకు రోడ్‌షోలో తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టని డీఎంకే ప్రభుత్వమే ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు.

పోస్టర్ల కలకలం...

అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకోవాలా? వద్దా? అని టీవీకే అధినేత విజయ్ మల్లగుల్లాలు పడుతుండగానే పార్టీ శ్రేణులు ఆయన అనుమతి తీసుకోకుండా మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్)ని స్వాగతిస్తున్నట్లు రాష్ట్రవ్యాప్తంగా పోస్టర్లు అంటిస్తున్నారు. ఇకపై ఎడప్పాడి పాల్గొనే సభలు ఎక్కడ జరిగినా విజయ్, ఈపీఎస్ ఫొటోలతో స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేస్తామంటూ సినీ అభిమానాలు, పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. ఈ పరిస్థితులలో విజయ్‌ని ఎన్డీయేలో చేర్చుకోవాలని అన్నాడీఎంకే నేతలు, బీజేపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎన్డీయేకి, తనకు రాజకీయ ప్రత్యర్థి డీఎంకే కనుక ఉమ్మడి శత్రువైన స్టాలిన్ ఢీకొనడానికి మెగా కూటమిలో చేరటమే మంచిదని విజయ్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ మేరకు టీవీకే క్రియాశీలక నేతలు అన్నాడీఎంకే నేతలతో చర్చిస్తున్నట్లు తెలిసింది.



సహాయాల పంపిణీలో ఏఐటీఎఫ్ ప్రతినిధులతో సీఎంకే రెడ్డి

తెలుగు ప్రజల సంక్షేమమే నా లక్ష్యం

● జన్మదిన వేడుకల్లో ఆచార్య సీఎంకే రెడ్డి

ప్యారీస్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ఉన్న తెలుగు ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి పేర్కొన్నారు. తెలుగు విద్యార్థులు తమ మాతృభాషలో పరీక్షలు రాయడం కోసం, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం, తెలుగు సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడం కోసం అహరహం పోరాటం సల్పుతానని స్పష్టం చేశారు. తెలుగువారు తమ పిల్లల్ని మాతృభాషలోనే చదివించాలని పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం స్థానిక కీల్పాక్‌లోని ఏఐటీఎఫ్ ప్రధాన కార్యాలయంలో సీఎంకే రెడ్డి జన్మదిన వేడుకలు 'మాతృభాష సంరక్షణ దినోత్సవం' పేరుతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్రప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బి.చంద్రమోహన్, ఏడీజీపీ డి.కల్పన నాయక్, పలువురు తెలుగు ప్రముఖులు, తెలుగు సంస్థల ప్రతినిధులు సీఎంకే రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 'నమో గాడ్ చారిటబుల్ ట్రస్టు' మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సీఎం కిషోర్ నిర్వహించగా, ఏఐటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నాయకర్ నందగోపాల్ స్వాగతం పలికారు. ట్రస్టీ డాక్టర్ ఎన్.నాగభూషణం వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో భాగంగా 100 మందికి పైగా పేదలు, పారిశుధ్య కార్మికులు, వృద్ధులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎంకే రెడ్డి మాట్లాడుతూ.. ఏఐటీఎఫ్ తెలుగువారందరినీ ఏకతాటిపైకి తెచ్చి, వారి సమస్యలపై సమైక్యంగా పోరాడే స్ఫూర్తిని కలిగించిందన్నారు. తమిళనాడులో నివసించే తెలుగు ప్రజలంతా ఐక్యంగా ఉంటేనే మాతృభాషను కాపాడుకోవడంతో పాటు హక్కులను సాధించుకోవచ్చని ఆయన ఉద్ఘాటించారు. ఏడీజీపీ కల్పన నాయక్ మాట్లాడుతూ.. శరద్ పూర్ణిమ పర్వదినం రోజు సీఎంకే రెడ్డి పుట్టినరోజు వేడుకలను అతిథిగా పాల్గొనడం సంతోషమని, ఆయన 82యేళ్ల జీవితంలో సుమారు 60యేళ్లుగా విద్య, వైద్యం, సామాజిక రంగాలకు అందిస్తున్న సేవలు అపారమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీఎఫ్ ఉపాధ్యక్షుడు లయన్ వీజీ జయకుమార్, కోశాధికారి కేవీ జనార్దనం, నిర్మల్ చందర్, సీబీ భుజంగరాం, వంజరపు శివయ్య, తెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు వి.అనంతరామన్, లయన్ జి.మురళి, లయన్ డాక్టర్ ఏ.వీ.శివకుమారి, కాంగ్రెస్ నేత విల్లివాక్కం సురేష్, టామ్స్ నిర్వాహకులు పాల్ కొండయ్య, అద్దంకి ఐసయ్య, వి.దేవదానం, తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు తమ్మినేని బాబు, కార్యదర్శి పీఆర్ కేశవులు, ఎస్‌కేడీటీ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రానికి భారీ వర్షసూచన

ప్యారీస్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి రాష్ట్రంలో విస్తరించిన కారణంగా ఈ నెల 9వ తేదీ గురువారం వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. కోస్తాంధ్రా నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి విస్తరించిందని దీని ప్రభావంతో వాతావరణంలో అనిచ్చితి నెలకొనడంతో ఆదివారం నుంచి తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. 9వ తేది గురువారం వరకు కోవై, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లోని కొండప్రాంతాలు, నీలగిరి, దిండుగల్, తేని, తెన్‌కాశి, మదురై, విరుదునగర్, శివగంగ జిల్లాల్లో ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో, విల్లుపురం, కళ్లకురుచ్చి, కడలూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, తిరుపత్తూరు జిల్లాలలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని ఐఎండీ తెలిపింది.



అందుకే డీఎంకేకు గవర్నర్ శత్రువు

● వారి అవినీతిని అడ్డుకుంటున్నారని ఆగ్రహం ● కేంద్రమంత్రి మురుగన్

ప్యారీస్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనం దోచుకుంటున్న డీఎంకేను అడ్డుకుంటున్నారన్న ఆగ్రహంతోనే రాష్ట్ర గవర్నర్‌ను ఆ పార్టీ శత్రువుగా పరిగణిస్తోందని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. కోవై మేట్టుపాళయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 2014వ సంవత్సరం కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రాష్ట్రాల అభివృద్ధిపై ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి సారించి నిధులు, పథకాల్లో సమన్యాయం పాటిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక జిల్లాగా గుర్తింపు పొందిన కోవైలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించే దిశగా బైపాస్ రోడ్డు, మేట్టుపాళయం-అవినాశి నాలుగు రోడ్ల విస్తరణ పనులను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నాలుగున్నరేళ్లకు పైగా అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని పక్కన బెట్టి భారీస్థాయిలో అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. ఈ అవినీతిని ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న గవర్నర్‌ను అధికార పార్టీ నేతలు బద్ధశత్రువుగా భావిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో పార్టీ బూత్ కమిటీలను ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయని, అన్నాడీఎంకే కూటమిలో ఉన్న మిత్రపక్షాలను కూడగట్టుకుని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే తమ ఏకైక లక్ష్యమని కేంద్రమంత్రి అన్నారు.



కోవైలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి ఎల్.మురుగన్

సమాచార దృష్టి

రవాణా కార్మికులకు దీపావళి అడ్వాన్స్
● రూ.152 కోట్ల కేటాయింపు

ప్యారీస్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ రవాణా శాఖలో పనిచేస్తున్న కార్మికులకు దీపావళి పండుగ సందర్భంగా అడ్వాన్స్ పంపిణీ చేసేందుకు రూ.152 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ రవాణా శాఖలో విల్లుపురం, కుంభకోణం, మదురై, సేలం, కోవై, తిరునల్వేలి విభాగాలు పనిచేస్తున్నాయి. వీటిలో పనిచేస్తున్న కార్మికులకు పండుగను పురస్కరించుకుని అడ్వాన్స్‌గా రూ.152.28 కోట్లను రుణంగా పంపిణీ చేయనున్నట్లు రవాణా శాఖ పేర్కొంది.

నేటినుంచి పనిచేయనున్న మెరీనా ఈతకొలను

పెరంబూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా మూసివేసిన మెరీనా స్విమ్మింగ్ పూల్ ఈ నెల 7వ తేది మంగళవారం నుంచి అందుబాటులోకి రానుందని జీసీసీ పేర్కొంది. స్థానిక మెరీనా తీరంలోని స్విమ్మింగ్ పూల్‌లో చేపట్టిన మరమ్మతుల కారణంగా గత జూలై 11వ తేది నుంచి మూసివేశామని తెలిపింది. రూ.2.50 కోట్లతో నీటి శుద్ధీకరణ వసతి, దివ్యాంగులు నడిచి వెళ్లేందుకు ప్రత్యేక బాట, ప్రత్యేక టాయిలెట్, దివ్యాంగులు స్విమ్మింగ్ పూల్‌లో దిగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని తెలిపింది. పనులు ముగియడంతో మంగళవారం నుంచి ఈ ఈత కొలను అందుబాటులోకి వస్తుందని తెలిపింది. ఉదయం 5.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పనిచేయనుండగా, ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు మహిళలకు ప్రత్యేక సమయం కేటాయించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా స్విమ్మింగ్ పూల్ రుసుము చెల్లించే వసతి కల్పించామని తెలిపింది. గంట సేపు ఈత కొట్టేందుకు పెద్దలకు రూ.50, ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ, అలాగే 12 నుంచి 14 ఏళ్లలోపున్న వారికి రూ.30, ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకున్న వారికి రూ.10 శాతం రాయితీ ఇస్తున్నామని జీసీసీ తెలిపింది.

రూ.20కే భోజనం
అన్ రిజర్వుడు ప్రయాణికులకు 'జనతా ఖానా'

పెరంబూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వేలో రూ.20కి 'జనతా ఖానా' పథకం ప్రారంభించారు. ప్రధాన రైల్వేస్టేషన్లలో 'వన్ స్టేషన్...వన్ ప్రొడక్ట్' స్టాళ్లను ఏర్పాటుచేసిన దక్షిణ రైల్వే, అన్ రిజర్వుడు ప్రయాణికులకు తక్కువ ధరకు ఆహారం అందించేలా 'జనతా ఖానా' పథకం అమలుచేసింది. ఈ విషయమై దక్షిణ రైల్వే అధికారులు మాట్లాడుతూ... అన్‌రిజర్వుడు ప్రయాణికులు ప్లాట్‌ఫాం నుంచి బయటకు వెళ్లకుండానే రూ.20 ధరకు ఆహారం కొనుగోలు చేయవచ్చన్నారు. ప్రస్తుతం ఈ పథకం చెన్నై సెంట్రల్, ఎగ్మూర్, తాంబరం, చెంగల్పట్టు, అరక్కోణం జంక్షన్, కాట్పాడి సహా 27 రైల్వేస్టేషన్లలో అందుబాటులో ఉందన్నారు.

డిప్లొమా కోర్సుకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి డిప్లొమా కోర్సు కోసం ఉపాధ్యాయులు నవంబరు 5వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్‌సీఈఆర్‌టీ తెలిపింది. జాతీయ విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఉపాధ్యాయుల నైపుణ్యాలు మెరుగుపరిచేలా, విద్యార్థులకు తగిన కౌన్సెలింగ్ అందించేలా 'గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్' పేరుతో ఒక సంవత్సరం డిప్లొమా కోర్సు అందిస్తోంది. రానున్న 2026 విద్యా సంవత్సరానికి ఈ కోర్సు రిజిస్ట్రేషన్ జరుగుతోంది. సంవత్సరం వ్యవధి కలిగిన ఈ కోర్సు తదుపరి సంవత్సరం జనవరి నుంచి జూన్ వరకు ఆరు నెలలు దూరవిద్య ద్వారా, జూలై నుంచి సెప్టెంబరు వరకు శిక్షణ కేంద్రాల్లో ప్రత్యక్ష తరగతులు నిర్వహించనున్నారు. చివరి మూడు నెలలు ఉపాధ్యాయులు తమ స్వగ్రామాల్లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, పాఠశాల నిర్వాహకులు నవంబరు 5వ తేదిలోపు https://ncert.nic.inలో దరఖాస్తులు సమర్పించాలని ఎన్‌సీఈఆర్‌టీ పేర్కొంది.

● ఎంబీబీఎస్ అడ్మిషన్లు
అఖిల భారత కోటాలో అదనంగా 138 సీట్లు

పెరంబూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య కోర్సుల అడ్మిషన్లలో, అఖిల భారత కోటాలో 138 సీట్లు పెంచారు. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్య కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశాలను నీట్ మార్కుల ఆధారంగా చేపడుతున్నారు. ఇందులో, అఖిల భారత కోటా సీట్లకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ), రాష్ట్ర కోటా సీట్లకు తమిళనాడు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్లు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం, రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ రెండు విడతలు ముగిసిన నేపథ్యంలో, వాటిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మూడో విడత సోమవారం ప్రారంభమై 9వ తేది వరకు జరగనుంది. అనంతరం 11 నుంచి 14వ తేది వరకు విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలను ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించారు. తుది కేటాయింపు ఉత్తర్వులు ఈ నెల 16వ తేది జారీ కానున్నాయి. ఈ క్రమంలో, అఖిల భారత కోటా సీట్ల భర్తీకి మూడవ విడత కౌన్సెలింగ్ మరియు నచ్చిన కళాశాలను ఎంపిక చేసే ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో, అఖిల భారత కోటా సీట్ల సంఖ్యను 138 పెంచారు. ఈ కారణంగా నచ్చిన కళాశాలను ఎంపిక చేసుకునేందుకు కాలపరిమితి పొడిగించే అవకాశముందని సమాచారం.

ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లకు శిక్షణ
● ప్రారంభించిన మంత్రి కోవీ చెళియన్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కోవీ చెళియన్, అధికారులు

ప్యారీస్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్, ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రిన్సిపాళ్ల నిర్వాహక ప్రతిభను మెరుగుపరచాలన్న ఉద్దేశంతో స్థానిక గిండిలో సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవీ చెళియన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వి.శంకర్, కళాశాల విద్యాకమిషనర్ సుందరవల్లి తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి చెళియన్ మీడియాతో మాట్లాడుతూ ఈ శిక్షణలో 175 మంది ప్రిన్సిపాళ్ల, జాయింట్ డైరెక్టర్లు అని మొత్తం 240 మంది పాల్గొన్నారని, నాలుగు రోజుల పాటు కార్యక్రమం జరుగుతుందన్నారు.

న్యాయమూర్తులను కించపరిచేలా వ్యాఖ్యలు
● ముగ్గురి అరెస్ట్



పోలీసుల అదుపులో కన్నన్, డేవిడ్, శశికుమార్‌లు

ప్యారీస్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనకు సంబంధించి తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడు విజయ్, ఆ పార్టీ జిల్లా నాయకులను తీవ్రంగా మందలించిన హైకోర్టు న్యాయమూర్తిని కించపరిచేలా సోషల్ మీడియాల్లో వదంతులు వ్యాపింపజేసిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కరూర్ తొక్కిసలాటలో 41 మంది మృతిచెందిన వ్యవహారంలో దాఖలైన ప్రజా ప్రయోజన వాజ్యాలపై గత శుక్రవారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ సహా ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం విచారణ జరిపింది. ఆ సందర్భంగా న్యాయమూర్తి సెంథిల్‌కుమార్... టీవీకే అధినేత విజయ్, పార్టీ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరూరులో జరిగిన విషాదం మానవ తప్పిదం వల్ల జరిగిన ఘోరమైన విపత్తు. దానికి సంబంధించిన వీడియోలు చూసి వేదనకు గురయ్యా. సంఘటన స్థలంలో చాలా మంది చిన్నారులు, మహిళలు మృతి చెందినట్లు తెలిసి కూడా టీవీకే నేతలు అక్కడి నుంచి పారిపోయారు. ఇది ఎలాంటి పార్టీ? సంఘటన జరిగిన వెంటనే ఆ స్థలంలో ఉన్న తమ వెంట వచ్చిన కార్యకర్తలు, అనుచరులను వదలిపెట్టి పారిపోయారు, ఆ పార్టీ నాయకుడికి నాయకత్వ లక్షణాలే లేవు. ఓ రాజకీయ పార్టీ చేసిన ఇలాంటి చర్యలను న్యాయస్థానం తీవ్రంగా ఖండిస్తోంది, జరిగిన ఘోరానికి విచారం కూడా వ్యక్తం చేయకపోవడం ఆ పార్టీ నాయకుడి మనస్తత్వాన్ని ఎలుగెత్తి చాటుతోందని న్యాయమూర్తి సెంథిల్ కుమార్ పేర్కొన్నారు. విజయ్‌ను ఈ మేరకు విమర్శించిన హైకోర్టు ధర్మాసనాన్ని కించపరిచే విధంగా సోషల్ మీడియాలో ఇటీవల ప్రసారమైన కథనాలు హల్‌చల్ చేశాయి. ఈ చర్యలకు పాల్పనవారిని అరెస్టు చేయాలని న్యాయస్థానం జారీచేసిన ఉత్తర్వుల మేరకు సోమవారం పుదుకోటకు చెందిన కన్నన్ (24), కృష్ణగిరి జిల్లా బర్గూరుకు చెందిన డేవిడ్ (22), చెన్నైకు చెందిన డేవిడ్ (48)ను అరెస్టుచేసి విచారణ జరుపుతున్నట్లు కరూర్ జిల్లా పోలీసు అధికారులు తెలిపారు.

సభ్యులను అధికంగా చేర్పిస్తే రూ.లక్ష బహుమతి
● మంత్రి మూర్తి



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి మూర్తి

ప్యారీస్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డీఎంకే యువజన విభాగంలో అధికంగా సభ్యులను చేర్చే నిర్వాహకులకు రూ.లక్ష బహుమతి ఉంటుందని రాష్ట్ర మంత్రి మూర్తి ప్రకటించారు. మదురై ఉత్తంగుడిలో డీఎంకే ఉత్తర జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో కొత్త సభ్యుల చేరికపై సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. సమావేశంలో వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి మూర్తి మాట్లాడుతూ... డీఎంకే యువజన విభాగాన్ని బలోపేతం చేసేందుకు కోటి మందికి పైగా సభ్యులను చేర్పాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోగా ఈ విభాగంలో అధిక మంది సభ్యులను చేర్చే నాయకులకు పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ చేతుల మీదుగా నలుగురికి తలా రూ.లక్ష అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. త్వరలోనే యువజన విభాగం రాష్ట్రస్థాయి మహానాడు జరుపుకునేందుకు డిప్యూటీ సీఎం ఉదయనిధి అనుమతిస్తారని, ఆ మహానాడుకు కూడా విజయవంతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల కోసం నియమితులైన నిర్వాహక కమిటీలు మేలూరు, చోళవందాన్, మదురై ఈస్ట్, మదురై వెస్ట్ నియోజకవర్గాల్లో పార్టీని అధిక ఓట్లతో గెలిపించేలా ఇప్పటి నుంచే పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో మంగళవారం నిర్వహించనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ తెలియజేసింది. 1వ మండలం పరిధిలోని 12వ వార్డు కాలడిపేట సాతంగాడు హైరోడ్డులో ఉన్న సెయింట్ పాల్స్ మహాజన హయ్యర్ సెకండరీ స్కూల్, 2వ మండలం పరిధిలోని 22 వార్డు మనలి దేవరాజన్ వీధిలో ఉన్న కమ్యూనిటీ హాలు, 4వ మండలం పరిధిలో 47వ వార్డు కొరుక్కుపేటలో ఉన్న ఏఈఎం స్కూల్ మైదానం, 5వ మండలం పరిధిలో 59వ వార్డు పల్లవన్ సాలై ఐల్యాండ్ గ్రౌండ్ సమీపంలో ఉన్న కేంద్రీయ విద్యాలయం పాఠశాల, 6వ మండలం పరిధిలో 71వ వార్డు నెల్వాయల్ రోడ్డులో ఉన్న కేలీరియల్ కమ్మవార్ కల్యాణ మండపం, 7వ మండలం పరిధిలో 84వ వార్డు అంబత్తూర్ టాస్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మూడవ మెయిన్ రోడ్డులో ఉన్న పీఎస్‌టీ కన్వెన్షన్ హాలు, 8వ మండలం పరిధిలో 102వ వార్డు షేనాయ్ నగర్ 12వ వీధి 'ఏ' బ్లాక్‌లో ఉన్న అమ్మ ఆడిటోరియం, 9వ మండలం పరిధిలో 121వ వార్డు మైలాపూర్ రాధాకృష్ణన్ రోడ్డులో ఉన్న క్వీన్ మేరీస్ కాలేజీల్లో శిబిరాలు జరుగనున్నాయి. అలాగే, 10వ మండలం 138వ వార్డు ఎంజీఆర్ నగర్ పచ్చయప్పన్ మెయిన్ రోడ్డులో ఉన్న అంజలి మహల్, 11వ మండలం 155వ వార్డు రామాపురం రాయలనగర్ మెయిన్ రోడ్డులో ఉన్న వల్లివడివేలన్ కల్యాణ మండపం, 12వ మండలం 159వ వార్డు మీనంబాక్కం కామరాజర్ రోడ్డులో ఉన్న ఆదిద్రావిడర్ హయ్యర్ సెకండరీ స్కూలు, 13వ మండలం వేళచ్చేరి గాంధీ రోడ్డులో ఉన్న సేవా నగర్ కమ్యూనిటీ హాలు, 14వ మండలం 182వ వార్డు పెరుంగుడి కందన్‌చావిడి రామప్ప నగర్ (వరల్డ్ ట్రేడ్ సెంటర్ వెనుక) సెయింట్ పీయూస్ ఎక్స్ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ పేర్కొంది.

కరూర్‌లో కొత్త బస్ స్టేషన్ ప్రారంభం



ప్యారీస్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో రూ.40 కోట్లతో 'ముత్తమిళ్ అరింజర్ కలైంజర్ కరుణానిధి' పేరుతో నిర్మించిన బస్‌స్టేషన్ సోమవారం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. 12.14 ఎకరాల్లో ఆధునిక వసతులతో నిర్మించిన బస్‌స్టేషన్ నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాలు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు బస్సులు నడుపుతున్నారు. ప్రస్తుతం పాత బస్ స్టాండ్ నుంచి నడుపుతున్న సిటీ బస్సులను ఈ బస్‌స్టేషన్ మీదుగా నడుపుతున్నారు. ప్రజల సౌకర్యార్థం 24 గంటలు సిటీ బస్సు సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

రాజకీయంగా లబ్ధిపొందాలన్నదే డీఎంకే లక్ష్యం
● మాజీ మంత్రి రాజేంద్ర బాలాజి



తెన్‌కాశిలో మీడియాతో మాట్లాడుతున్న రాజేంద్ర బాలాజి

ప్యారీస్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా లబ్ధిపొందాలన్న దృష్టితోనే డీఎంకే పనిచేస్తోందని అన్నాడీఎంకే మాజీ మంత్రి రాజేంద్ర బాలాజి విమర్శించారు. ఆయన సోమవారం తెన్‌కాశిలో మీడియాతో మాట్లాడుతూ... 2021 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డీఎంకే ఇచ్చిన 500ల హామీల్లో ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారం కోసం ప్రజలను మోసం చేయడం సీఎం స్టాలిన్‌కు అలవాటేనని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే రాజకీయంగా లబ్ధిపొందాలని తహతహలాడుతుంటారని ఎద్దేవా చేశారు. డీఎంకే పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నేతృత్వంలోని కూటమిని అధిక స్థానాల్లో గెలిపించాలని ఆయన కోరారు.

సీపీసీఎల్‌లో స్థానికులకు ఉద్యోగాలివ్వాలి
ధర్నా చేపట్టిన మాజీ ఎమ్మెల్యే ● 50 మంది అరెస్ట్



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కుప్పన్, అన్నాడీఎంకే నేతలు

ప్యారీస్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మనలిలో కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని సీపీసీఎల్ కర్మాగారంలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటూ ధర్నా చేపట్టిన అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే కుప్పన్ సహా 50 మంది కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. సీపీసీఎల్ కర్మాగారంలో తమిళుల కంటే ఉత్తరాదికి చెందిన కార్మికులు అధికంగా పనిచేస్తున్నారు. ఈ కర్మాగారంలో యేటా నిర్వహించే మరమ్మతుల్లో కూడా స్థానికులకు అవకాశం ఇవ్వడం లేదు. సుమారు 3,000 మందికి పైగా ఉత్తరాది కార్మికులు పనిచేస్తున్న ఈ కర్మాగారంలో, స్థానికులకు ఉపాధి అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం ఉదయం ఆ కర్మాగారం ముందు అన్నాడీఎంకే కార్యకర్తలు ప్లకార్డులతో ధర్నా చేపట్టారు. అనుమతి లేకుండా ధర్నా చేపట్టడంతో 50 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

19వ వార్షిక విష్ణు సహస్రనామ పారాయణం



విష్ణుసహస్రనామ పారాయణంలో నిర్వాహకులు, భక్తులు

వేలూరు, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం విష్ణుసహస్రనామ పారాయణం కార్యక్రమం జరిగింది. వేలూరు సత్తువాచారిలోని వినాయక ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు గణపతి పాల్గొన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వరపూజతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పురటాసి మాసాన్ని పురస్కరించుకుని సంఘ నిర్వాహకులు, భక్తులతో కలిసి లోకకల్యాణార్థం విష్ణుసహస్రనామ పారాయణం గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. సుబ్రమణ్యన్, విజయరాఘవన్, రాజగోపాల్, సత్యమూర్తి, మీనాక్షి, సునంద, బృందా పాల్గొన్నారు.

● మంత్రి దురైమురుగన్ ఆస్తుల కేసు
రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి దురైమురుగన్‌కు వ్యతిరేకంగా నమోదైన ఆస్తుల కేసు చెన్నైకి బదిలీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 23వ తేదిలోపు అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 2007 -09 మధ్య ప్రజాపనుల శాఖ మంత్రిగా వ్యవహరించిన సమయంలో, ఆదాయానికి మించి రూ.140 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టారంటూ మంత్రి దురైమురుగన్‌పై 2012లో అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. ఆయన భార్యపై కూడా కేసు నమోదైంది. ఈ కేసు వేలూరు ప్రత్యేక కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసును 2019లో చెన్నైలో ఉన్న ప్రత్యేక కోర్టుకు బదిలీ చేస్తూ జీవో విడుదలైంది. ఈ జీవోను వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో మంత్రి దురైమురుగన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు సోమవారం విచారణకు రాగా, ఈ వ్యవహారంపై ఈ నెల 23వ తేదిలోపు అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం నోటీసు జారీచేసింది.

ఎంజీఆర్ విగ్రహం ధ్వంసం



మళ్లీ అదే ప్రాంతంలో ప్రతిష్ఠించిన ఎంజీఆర్ విగ్రహం

ప్యారీస్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ధ్వంసమైన ఎంజీఆర్ విగ్రహాన్ని పునరుద్ధరించి నివాళులర్పించారు. మదురై అవనియాపురం జల్లికట్టు నిర్వహించే వాడివాసల్ ప్రాంతంలో దివంగత మాజీ సీఎం ఎంజీఆర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఖండించారు.దీనిపై ఆయన సోమవారం తన ఎక్స్ పేజీలో... అవని యాపురం వాడివాసల్ సమీపంలో ఉన్న ఎంజీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినంత మాత్రాన ఆయన కీర్తిప్రతిష్ఠలు మరుగున పడవని, అన్నాడీఎంకేతో నేరుగా ఢీకొనలేని పిరికిపందలు ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటారన్నారు. ఈ చర్యలను పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని పళనిస్వామి డిమాండ్ చేశారు. ఈ క్రమంలో, ధ్వంసమైన ఎంజీఆర్ విగ్రహానికి మరమ్మతులు పూర్తి చేసి, మళ్లీ అదే పీఠంపై ప్రతిష్ఠించి పూలదండలతో అన్నాడీఎంకే నాయకులు నివాళులర్పించారు.

ఆస్పత్రికి మరమ్మతులు చేయించండి
● మంత్రి దురైమురుగన్‌కు గ్రామస్తుల విజ్ఞప్తి

వేలూరు, అక్టోబర్6(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరమ్మతులు చేయించాలని సోమవారం ఉదయం మంత్రి దురైమురుగన్‌కు జిల్లా వ్యవసాయ సంఘ అధ్యక్షుడు శేఖర్ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ... గుడియాత్తం సమీపంలోని భోజనాపురంలోని ఆస్పత్రిలో సరైన వసతులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. రైతు సంఘాల నిర్వాహకులు రాజ్, పార్తిబన్ తదితరులు పాల్గొన్నారు.

వేలుచ్చామిపురంలో ఎంపీ కమల్

చెన్నై, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాట ప్రాంతాన్ని మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు, ఎంపీ కమల్ సోమవారం పరిశీలించారు. కరూర్ వేలుచ్చామిపురంలో గత నెల 27న టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందగా, 107మంది గాయపడిన విషయం విదితమే. ఈ క్రమంలో కమల్ సోమవారంమి ఘటన జరిగిన ప్రాంతాన్ని కమల్ పరిశీలించారు. అనంతరం మృతుల కుటుంబాలను కలుసుకుని ఓదార్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఒక మనస్సున్న రాజకీయ నేతగా ముఖ్యమంత్రి వ్యవహరించిన తీరు అభినందనీయమన్నారు.

మహిళతో ఇద్దరికి వివాహేతర సంబంధం
● మిత్రుడి మర్మాంగాన్ని కోసేసిన వ్యక్తి

ప్యారీస్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లాలో ఒకే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యవహారంలో మిత్రుడి మర్మాంగాన్ని కోసిన వ్యక్తికోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విల్లుపురం సమీపంలోని మరగదపురానికి చెందిన శంకర్ (45), ఇరువేర్పట్టికి చెందిన అన్బు (39) మిత్రులు. ఈ నేపథ్యంలో, శనివారం రాత్రి మరగదపురం పంట కాలువ పక్కన శంకర్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు అందిన సమాచారంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు అతన్ని ముండియంపాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి జరిపిన విచారణలో తన భార్యకు దూరమైన శంకర్ అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధ పెట్టుకున్నాడు. అతని మిత్రుడు అన్బు కూడా అదే మహిళతో వివాహేతర సంబంధం నడిపాడు. శంకర్ మద్యం మత్తులో ఉండగా ఆయన మర్మాంగాన్ని కోసిన అన్బు ఓ కన్ను కూడా బయటికి లాగి పంటకాలువ పక్కన పడేసి పరారైనట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఉన్న శంకర్‌కు వైద్యులు చికిత్స కొనసాగిస్తున్నారు. పరారైన అన్బు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మహిళను కూడా విచారిస్తున్నారు.

నూతన ఆస్పత్రి ప్రారంభం





కార్యక్రమంలో మంత్రి దురైమురుగన్ తదితరులు

వేలూరు, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి సమీపం లోని సిప్కాట్‌లో రూ.16 కోట్లతో నిర్మించిన నూతన ఆస్పత్రిని సోమవారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దురైమురుగన్, ఆరోగ్య శాఖ మంత్రి సుబ్రమణ్యం ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి దురైమురుగన్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. అదేవిధంగా నూతనంగా ప్రారంభమైన ఈ ఆస్పత్రిలో అదే ప్రాంతానికి చెందిన డాక్టర్లు, టెక్నీషియన్లు, నర్సులకు ఉద్యోగావకాశాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

అవినీతి జరిగితే జలజీవన్ నిధులు నిలిపివేత
● రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ హెచ్చరిక

పెరంబూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ పథకంలో అవినీతి జరిగితే నిధులు నిలిపివేస్తామని కేంద్రప్రభుత్వం హెచ్చరించిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తెరగాలని రాష్ట్ర బీజేపీ తెలిపింది. ఈ విషయమై ఆ పార్టీ అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో చేపడుతున్న పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందజేస్తున్నా, డీఎంకే ప్రభుత్వం పథకాలను పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. అదే సమయకంలో కేంద్రం నిధులు అందించడం లేదని ఆరోపిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం జలజీవన్ పథకంలో 1.12 కోట్ల ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇచ్చేందుకు నిర్ణయించిందన్నారు. ఈ ప్రాజెక్ట్ పనులు ఆలస్యమైనా, అవినీతి జరిగినా సంబంధిత కాంట్రాక్టర్లకు అందించాల్సిన నిధులు నిలిపివేస్తామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించిందన్నారు. పలు పథకాలు, ప్రాజెక్టులపై రాష్ట్రప్రభుత్వం తగినంత శ్రద్ధ చూపకపోవడం, అవినీతి, నిర్వహణ లోపం కారణంగా రాష్ట్రానికి అందించాల్సిన నిధులు నిలిపివేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కేంద్రప్రభుత్వ నిధులను వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్న ముఖ్యమంత్రి, నిరంతరం కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని, ఇది రాష్ట్రాభివృద్ధికి ఆటంకంగా మారుతోందని ప్రసాద్ పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిలో మంత్రి సుబ్రమణ్యం తదితరులు

వేలూరు, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సోమవారం ఉదయం ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి వసతులు, సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలు ప్రారంభం



ప్యారీస్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు సోమవారం ఉదయం పునఃప్రారంభమయ్యాయి. రాష్ట్ర పాఠ్యప్రణాళికలో 1 నుంచి ప్లస్‌టూ విద్యార్థులకు త్రైమాసిక పరీక్షల అనంతరం 27వ తేదీ నుంచి ఈ నెల 5వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. సెలవులు ముగియడంతో సోమవారం పాఠశాలలు ప్రారంభకావడంతో విద్యార్థులు ఆసక్తిగా హాజరయ్యారు. సోమవారం 1 నుండి 7వ తరగతి వరకు చదువుకుంటున్న 32,60,960 మంది విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈశాన్య రుతుపవనాల ఆగమనంతో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత కల్పించేలా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ప్రమాదంలో దగ్ధమైన ప్రైవేటు బస్సు

పెరంబూర్,అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా ఆర్ఆర్ నగర్ ప్రాంతంలో లారీ ని ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో ప్రైవేటు బస్సు దగ్ధమైంది. ఆర్ఆర్ నగర్ నుంచి సిమెంటు లోడుతో తెన్‌కాశికి బయల్దేరిన లారీకి సాత్తూర్ పెరియకొల్లపట్టికి చెందిన రాఘవన్ (42) డ్రైవర్. సర్వీస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డుకు లారీ ఎక్కుతున్న సమయంలో, చెన్నై నుంచి నాగర్‌కోయిల్‌కు వెళ్తున్న ప్రయాణికులు లేని ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ఘటనలో లారీ, బస్సుల్లో మంటలు చెలరేగాయి. రాఘవన్, బస్సు డ్రైవర్ గణేశన్ (25)కు కాలిన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేసేలోగా ప్రైవేటు బస్సు పూర్తిగా దగ్ధమైంది. గాయపడిన డ్రైవర్లను సాత్తూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించిన వచ్చకారంపట్టి పోలీసులు, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెన్నై హైవేపై రోడ్డు ప్రమాదం



బంగారు పేట ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న అధికారులు

బంగారుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు, చెన్నై జాతీయరహదారి కర్ణాటక రాష్ట్రం బంగారుపేట తాలూకా కల్కెరె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం ముగ్గురు దుర్మరణం చెందారు. క్షతగాత్రులను తరలించే ప్రయత్నంలో అంబులెన్స్ డ్రైవర్ మృత్యువాత పడడం విషాదం మిగిల్చింది. గ్రామం వద్ద ఓ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి, కర్ణాటక రాష్ట్రం ఉడిపి జిల్లాకు చెందిన వారు 24 మంది వచ్చారు. సోమవారం సాయంత్రం 407 వాహనంలో బెంగళూరు వైపు వారంతా బయల్దేరారు. వాహనం మలుపు తిరుగుతుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఇదే సమయంలో ఓ లగేజీ వాహనం వేగంగా వచ్చి బోల్తా పడిన వాహనాన్ని ఢీ కొట్టింది. ప్రమాదంలో శివరాజు(40), అశోక్(38) అక్కడికక్కడే మృతి చెందగా విక్రమ్ పాల్(43) ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. క్షతగాత్రులను తరలించేందుకు హైవే అంబులెన్స్ ప్రమాదస్థలికి చేరింది. గాయపడ్డవారిని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న సమయంలోనే వెనక వైపు నుంచి వచ్చిన మరో లగేజీ వాహనం ఢీ కొనడంతో అంబులెన్స్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. అతని వివరాలు తెలియరాలేదు. గాయపడ్డవారిలో 11 మందిని కేజీఎఫ్ ఆస్పత్రికి, 10 మందిని బంగారుపేట ఆస్పత్రికి తరలించారు. కేజీఎఫ్ తహసీల్దార్ సుధాకర్ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు.

మనిషి - ప్రకృతి - ఏనుగు బంధాన్ని తెలిపే 'కుంకీ-2'

చిత్రజ్యోతి

మనిషి - ప్రకృతి - ఏనుగు మధ్య ఉండే బంధం, నమ్మకం, స్నేహాన్ని వ్యక్తం చేస్తూ తెరకెక్కించిన చిత్రం 'కుంకీ-2'. బెన్ స్టూడియోస్ అధినేత డాక్టర్ జయంతిలాల్ కాడా సమర్పణలో ప్రభుసాల్మన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంది. ఈ సినిమా ద్వారా హీరోగా మధి వెండితెరకు పరిచయమవుతున్నారు. నివాస్ కె.ప్రసన్న సంగీతం అందించారు. ఏనుగుల మందతో అనేక ఆసక్తికర సన్నివేశాలను దట్టమైన అడవుల్లో చిత్రీకరించారు. 'మైనా', 'కుంకీ-1', 'మాన్ కరాటే', 'ధర్మదురై', 'భైరవ', 'తలైవన్ తలైవి' వంటి చిత్రాలకు సినిమాటోగ్రఫీ అందించిన ఎం.సుకుమార్ ఈ మూవీకి ఛాయాగ్రహణం అందించారు. ఇతర పాత్రల్లో శ్రితరావు, ఆండ్రూస్, అర్జున్ దాస్, ఆకాష్, హరీష్ పేరడి, శ్రీనాథ్ తదితరులు నటించారు. ఈ సినిమా విశేషాలను దర్శకుడు వివరిస్తూ... 'ఈ సినిమాలో వెండితెరకు పరిచయమవుతున్న మధి ఓర్పు, అంకితభావం, సహనం, కృషి, పట్టుదల, శ్రమ ప్రతి ఒక్కరినీ ఆకర్షించింది. పాత్రకు అవసరమైన కష్టమైన సన్నివేశాల్లో నటించారు. దట్టమైన అడవుల్లో ఏనుగులను మచ్చిక చేసుకుని, వాటితో కలిసి నడుస్తూ అనేక కష్టాలను చవిచూశారు. ఈ సినిమాలో అతని కష్టం స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో వచ్చిన తొలి భాగానికి ఏమాత్రం తీసిపోని విధంగా ఈ సినిమా ఉంటుంది. ఈ సినిమాలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు మరుపురాని అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు.


'కుంకీ-2'లో మధి

ఆయిల్ మాఫియాపై 'డీజల్'

క్రూడ్ ఆయిల్ మాఫియా నేపథ్యంలో 'డీజల్' చిత్రాన్ని తెరకెక్కించినట్టు దర్శకుడు షణ్ముగం ముత్తుస్వామి తెలిపారు. హరీష్ కల్యాణ్, అత్యుల రవి జంటగా నటించిన ఈ చిత్రం దీపావళి పండుగను పురస్కరించుకుని ఈనెల 17న విడుదలకానుంది. ఈ సందర్భంగా హీరో హరీష్ కల్యాణ్‌తో కలిసి చిత్ర దర్శకుడు షణ్ముగం సోమవారం చెన్నైలో మీడియాతో ముచ్చటించారు. ముందుగా దర్శకుడు మాట్లాడుతూ... 'సాధారణంగా పెట్రోల్ బంకుల్లో ఆయిల్ కల్తీ జరుగుతుందని వింటుంటాం. వాస్తవానికి పెట్రోల్ బంకుల్లో కంటే క్రూడ్ ఆయిల్‌లోనే భారీగా కల్తీ జరుగుతుంది. ఇది ఇంటర్నేషనల్ మాఫియా. దీనిపై ఏడేళ్లపాటు పరిశోధన చేశా. దీని ఆధారంగా అనేక చిత్రాలు తీయొచ్చు. అయితే, పరిశోధనలోని ముఖ్యాంశాలను తీసుకుని ప్రజలకు ఏం అవసరమో అదే చెప్పా. 2012 ముందు ఈ మాఫియా ఎంతో యాక్టివ్‌గా ఉండేది. ఇపుడు ఆ స్థాయిలో లేదు. దీనికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు చమురు కంపెనీలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నాయి' అని చెప్పారు.


'డీజల్'లో హరీష్ కల్యాణ్ - అతుల్య రవి

హీరో హరీష్ కల్యాణ్ మాట్లాడుతూ... 'ఇది నేను నటించిన తొలి యాక్షన్ చిత్రం. ఇందులో జాలరిగా నటించా. సముద్రంలో పడవ నడపడం, చేపల వేట కోసం వల విసరడం వంటివాటిపై శిక్షణ తీసుకున్నా. ఆయిల్ మాఫియా ముఠాలో ఒక సభ్యుడుగా నటించా. ఈ ముఠాకు సముద్రతీరంలో ఉండే జాలర్లకు సంబంధం ఉంది. వెయ్యి మంది బాగుండాలంటే పది మంది కష్టపడాలి అనేది వన్ లైన్ స్టోరీ. హీరోయిన్ అతుల్య రవి అడ్వకేట్‌గా నటించారు. ప్రేమ, సెంటిమెంట్, కామెడీ ఇలా అన్ని అంశాలు ఇందులో ఉన్నాయి. నేను నటించిన 'లబ్బర్ పందు', 'పార్కింగ్' చిత్రాలు ఘనవిజయం సాధించాయి. ఈ చిత్రం విజయంతో హ్యాట్రిక్ ఆశిస్తున్నా. 'పార్కింగ్'కు మూడు జాతీయ అవార్డులు రావడం సంతోషం. ఒక ఫ్యాన్‌బాయ్‌గా ఉన్న సమయంలో దీపావళికి విడుదలయ్యే కొత్త సినిమాలను చూసేందుకు థియేటర్‌కు వెళ్లేవాడిని. ఇప్పుడు నేను హీరోగా నటించిన చిత్రం విడుదల కావడం ఒకింత ఎగ్జైట్‌మెంట్‌గా ఉంది' అన్నారు. కాగా, థర్డ్ ఐ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మాతలు దేవరాజులు, మార్కండేయన్ నిర్మించగా, వినయ్‌రాయ్ విలన్ పాత్రను పోషించారు. అనన్య, కరుణాస్, సాయికుమార్, రమేష్ తిలక్, కాళీవెంకట్, వివేక్ ప్రసన్న, జాకీర్ హుస్సేన్, ధీన, అపూర్వ సింగ్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. సంగీతం దిబు నినన్ థామస్.



యాక్షన్ హీరోయిన్‌గా నటించాలని ఉంది

● అక్షర రెడ్డి

తనకు యాక్షన్ హీరోయిన్‌గా నటించి, గుర్తింపు పొందాలని ఉందని యువ నటి అక్షర రెడ్డి అన్నారు. ఇటీవల విడుదలైన రైట్ ద్వారా కోలీవుడ్ ప్రేక్షకులకు ఆమె పరిచయమయ్యారు. తమిళంలో ఎంట్రీపై ఆమె స్పందిస్తూ, ' నాన్నపేరు సుధాకర్ రెడ్డి. నేను సినిమాల్లోకి రాకముందే మార్షల్ ఆర్ట్స్, బాక్సింగ్‌లో శిక్షణ పొందా. సినిమాల్లో యాక్షన్ హీరోయిన్‌గా నటించాలన్న నా కోరిక. అలాంటి అవకాశం వస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా అంగీకరిస్తా. ఇప్పుడు విలువిద్యలో శిక్షణ పొందుతున్నా. బైక్, హార్స్ రేసింగ్ చేస్తా. ఇవన్నీ కూడా సినిమా రంగంలో స్థిరపడాలనే నేర్చుకున్నా. కోలీవుడ్‌లో అందరి హీరోలతో నటించాలని ఉంది. నాకు నచ్చిన మంచి పాత్రల్లో నటించి తమిళ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొనాలన్నదే నా లక్ష్యం' అని పేర్కొన్నారు.

ధనుష్ 'డి-54' చిత్రీకరణ పూర్తి

● ఫిబ్రవరిలో విడుదల?

యువ డైరెక్టర్ విఘ్నేష్ రాజా దర్శకత్వంలో ధనుష్ హీరోగా నటించిన వర్కింగ్ టైటిల్ 'డి-54' చిత్రీకరణ పనులు పూర్తయ్యాయి. జూలైలో ప్రారంభమైన షూటింగ్ శరవేగంగా పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. అలాగే, ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేస్తున్నారు. గతంలో విఘ్నేష్‌రాజా దర్శకత్వంలో శరత్ కుమార్, అశోక్ సెల్వన్ ప్రధాన పాత్రలను పోషించిన 'పోర్ తొళిల్' తరహాలోనే ఈ సినిమాను పూర్తిస్థాయి థ్రిల్లర్‌గా రూపొందించినట్టు సమాచారం. త్వరలోనే టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, వేల్స్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ ఈ చిత్రాన్ని నిర్మించగా, వచ్చే యేడాది ఫిబ్రవరిలో విడుదల చేయనున్నారు. ఇదిలా ఉండగా ధనుష్ స్వీయ నిర్మాణ దర్శకత్వంలో నటించిన 'ఇడ్లీ కడై' ఈ నెల1న విడుదలై ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. అలాగే, వచ్చే నెలలో ధనుష్ నటించిన హిందీ మూవీ 'తేరే ఇష్క్ మే' విడుదలకానుంది.


ధనుష్ - ఐసరి కె.గణేష్

విల్లుపురం-తిరుచ్చి మార్గంలో కొత్త ప్రయోగం

● గంటకు 130 కి.మీ.ల వేగంతో నడవనున్న రైళ్లు ● 84 కిలోమీటర్ల పొడవున రీటైనింగ్ వాల్

ప్యారీస్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం - తిరుచ్చి మార్గంలో గంటకు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిపేందుకు దక్షిణరైల్వేశాఖ పథకం రూపొందించింది. ఈ మార్గంలో విల్లుపురం - తాళనల్లూరు మధ్య 84 కిలోమీటర్ల దూరానికి రెండువైపులా రీటైనింగ్‌వాల్ నిర్మించనున్నారు. రైళ్లు వెళ్లే వేగాన్ని బట్టి విభజించిన గ్రూప్-ఎ మార్గంలో గరిష్ఠంగా 160 కిలోమీటర్ల వేగంతో, గ్రూప్-బి మార్గంలో గంటకు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడుపుతారు. ఇదే తరహాలో చెన్నై - రేణిగుంట, అరక్కోణం - జోలార్‌పేట మార్గాల్లో ప్రస్తుతం గంటకు 120 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో చెన్నై - తిరుచ్చి, మదురై - కన్నియాకుమారి మార్గంలో గంటకు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిపేలా పనులు జరుగుతున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. దక్షిణ రైల్వే పరిధిలో 2,485 కిలోమీటర్ల మేరకు ఉన్న రైలు మార్గాల్లో ప్రధాన మార్గాల్లో ప్రస్తుతం రైళ్లను గంటకు 110 కిలోమీటర్ల వేగంతో నడుపుతున్నట్లు తెలిపారు. ఈ మార్గాల్లో 145 కిలోమీటర్ల వేగం వరకు నడిపేలా వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అరక్కోణం - జోలార్‌పేట, గూడూరు మార్గాల్లో గరిష్ఠంగా గంటకు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్ల సేవలు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా ఎగ్మూర్ - విల్లుపురం - విరుదాచలం - తిరుచ్చి మార్గాల్లో ప్రస్తుతం గంటకు 110 కిలోమీటర్ల వేగంతో నడుపుతున్న వేగాన్ని 130 కిలోమీటర్లకు పెంచేందుకు అవసరమైన సదుపాయాలు సమకూర్చనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం విల్లుపురం-తాళనల్లూరుల మధ్య 84 కిలోమీటర్ల దూరానికి రైలు మార్గం పునరుద్ధరణ, ఆధునిక సిగ్నల్ ఏర్పాట్లు, ట్రాక్‌కు రెండువైపులా రీటైనింగ్‌వాల్ నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్ల ఎంపిక పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.


విల్లుపురం-తిరుచ్చి రీటైనింగ్ వాల్ నమూనాచిత్రం

ఐఓసీ మార్కెటింగ్ డైరెక్టర్‌గా సౌమిత్ర



అడయార్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ చమురు సంస్థల్లో ఒకటైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) మార్కెటింగ్ విభాగ డైరెక్టర్‌గా సౌమిత్ర పి.శ్రీవస్తవ బాధ్యతలు స్వీకరించారు. ఐఐటీ-రూర్కెలా నుంచి సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆయన... ముంబైలోని ఎస్పీ జైన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఎంబీఏను పూర్తి చేశారు. ప్రధానంగా క్షేత్రస్థాయి కార్యకలాపాలు, మార్కెటింగ్, వ్యూహంలో విస్తృత అనుభవం కలిగిన నిష్ణాత ఎగ్జిక్యూటివ్‌గా గుర్తింపు పొందారు. వ్యాపార వృద్ధితో పాటు కంపెనీ లాభాలను ఆర్జించడంలో ఆయన నాయకత్వశైలి దోహదపడుతుందని ఐఓసీ భావిస్తోంది. గతంలో ఆయన మహారాష్ట్ర, గోవాల్లో అనేక కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. ఉత్తర, ఈశాన్య ప్రాంతాల్లో రిటైల్ బిజినెస్ హెడ్‌గా పనిచేశారు. న్యూఢిల్లీ, ముంబైలో డివిజనల్ కార్యాలయాలకు నాయకత్వం వహించారు. ఇపుడు ఐఓసీ మార్కెటింగ్ విభాగం డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన తన అపారమైన అనుభవంతో దేశ వ్యాప్తంగా మార్కెటింగ్ మౌలిక సదుపాయాల వ్యూహాత్మక దిశగా ముందుకు తీసుకెళతారని భావిస్తున్నారు.

కర్రకు బదులు గడ్డపారతో కర్రసాము

పెరంబూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్రకు బదులుగా గడ్డపారతో చేసిన కర్రసాము రికార్డ్స్ బుక్స్‌లో నమోదైంది. వళ్లలార్ 203వ జయంతి సందర్భంగా రామనాథపురం జిల్లా సాయల్‌కుడిలో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు 6 కిలోల గడ్డపారను కర్రసాము మాదిరిగా నిర్విరామంగా నాలుగు గంటలు తిప్పుతూ సాధన చేశారు. ఈ సాధనను నోబుల్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదుచేసినట్లు పేర్కొన్న సంస్థ నిర్వాహకులు, ఇద్దరు విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు.


గడ్డపారతో సాము చేసిన విద్యార్థులు

దీపావళి పండుగ సందర్భంగా 20,378 ప్రత్యేక బస్సులు

చెన్నై, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రజల సౌకర్యార్థం 20,378 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. దీపావళి పండుగ ఈ నెల 20వ తేది రానుంది. పండుగను స్వగ్రామంలో జరుపుకునేందుకు నగరాల్లో ఉద్యోగం, ఉపాధి, పనులకు వెళ్తున్న వారు కుటుంబాలతో వెళ్తుంటారు. స్వగ్రామాలకు వెళ్లే వారి కోసం రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ క్రమంలో, ఈ నెల 20న నడపనున్న ప్రత్యేక బస్సులపై మంత్రి శివశంకర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... చెన్నై నుంచి ఈనెల 16 నుంచి 19వ తేది వరకు 14,208 ప్రత్యేక బస్సులు, ఇతర ప్రాంతాల నుంచి 6,000 ప్రత్యేక బస్సులు నడపనున్నామని తెలిపారు. అలాగే, పండుగ ముగించుకుని తిరిగివచ్చే వారి కోసం మూడు రోజులు 10,529 ప్రత్యేక బస్సులు నడపనున్నామన్నారు. ప్రత్యేక బస్సుల్లో రిజర్వేషన్ కోసం కిలంబాక్కం బస్ టెర్మినల్‌లో 10, కోయంబేడులో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దీపావళి పండుగ ఇంకా 13 రోజులో ఉన్న నేపథ్యంలో, ఇప్పటివరకు 2 లక్షల మంది రిజర్వేషన్ చేసుకున్నారని మంత్రి తెలిపారు.

108 ప్రత్యేక రైళ్లు...

దీపావళి పండుగ సందర్భంగా 108 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు దక్షిణ రైల్వే పేర్కొంది. పొరుగు రాష్ట్రాలకు 54 రైళ్లు, దక్షిణ రైల్వే పరిధిలోని తమిళనాడు సహా ఇతర ప్రాంతాలకు 54 రైళ్లు నడుపనున్నామని తెలిపారు. పండుగ సందర్భంగా ప్రయాణికులు రైళ్లలో బాణసంచా తీసుకెళ్లరాదని దక్షిణ రైల్వే పేర్కొంది.

కరూర్‌లో రెండో రోజు సిట్ విచారణ


చెన్నై, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనపై విచారణ ప్రారంభించిన నార్త్ జోన్ ఐజీ అస్రాగార్గ్ నాయకత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సోమవారం ఉదయం మృతుల కుటుంబీకుల వద్ద రహస్యంగా విచారణ చేపట్టింది. ఆదివారం తొక్కిసలాట జరిగిన వేలుచ్చామిపురం వద్ద సిట్ అధికారులు విచారణ జరిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిట్‌లో ఉన్న పది మంది సభ్యులు వేర్వేరు జట్లుగా ఏర్పడి, ప్రసారమాధ్యమాలకు ఎలాంటి సమాచారం తెలపకుండా మృతుల కుటుంబ సభ్యులను, గాయపడినవారి ఇళ్ళ వద్దకు కూడా వెళ్లి వివరాలు సేకరించారు.

అబ్బుర పరిచిన నావికాదళం మాక్ డ్రిల్



పెరంబూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ కాలుష్య నియంత్రణ దినం సందర్భంగా భారత నావికాదళం నిర్వహించిన మాక్ డ్రిల్ అబ్బురపరిచింది. భారత నావికాదళం, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డు (టీఎన్‌పీసీబీ), రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం, చెన్నై పోర్ట్ అధికారులు, చమురు పరిశ్రమ వాటాదారులు, అంతర్జాతీయ పరిశీలకుల సమన్వయంతో స్థానిక చెన్నై బీచ్‌లో 'ఆయిల్-స్పిల్' పేరు ఈ మాక్ డ్రిల్ సాగింది. సముద్రంలో ఓడలో అగ్నిప్రమాదం జరిగితే అందులోని వారిని రక్షించడం, మంటలు అదుపుచేయడం, రెండు ఓడలు ఢీకొన్న సమయంలో ఏర్పడే ప్రమాదాలు నిరోధించడం, సముద్రంలో ఆయిల్ కలిస్తే, దాని వల్ల కలిగే నష్టాలు, ఆయిల్ తొలగించే చర్యలు తదితరాలను ప్రత్యక్షంగా చూపేలా మాక్ డ్రిల్ సాగింది. ఈ మాక్ డ్రిల్‌లో ఓడలు, హెలికాప్టర్లు, ఎయిర్ క్రాఫ్ట్ తదితరాలు పాల్గొన్నాయి.


ఓడలో చెలరేగిన మంటలు ఆర్పుతున్న మరో ఓడ


నడి సముద్రంలో చిక్కిన సరుకుల ఓడ గాలింపులో హెలికాప్టర్లు - మంటలు అదుపుచేసేలా మాక్ డ్రిల్ - సముద్రంలో కలసిన చమురు తొలగింపు

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



చెన్నై, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలైలోని పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థులు క్రీడా ఉపకరణాలు, విద్యా సామగ్రి అందజేశారు. పాఠశాలలో చదివి ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులు, పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు సాయం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు, స్థానిక అన్నాసాలైలోని ఖాయిదే మిల్లత్ కళాశాల వెనుక ఉన్న మదరసా-ఈ-అజామ్ మహోన్నత పాఠశాలను సోమవారం సందర్శించిన పూర్వ విద్యార్థుల బృందం, పాఠశాల విద్యార్థులకు క్రీడా ఉపకరణాలు, విద్యా సామగ్రి అందజేశారు. పూర్వ విద్యార్థులను పాఠశాల నిర్వాహకులు అభినందించారు.

జాలర్లపై శ్రీలంక సముద్ర దొంగల దాష్టీకం


సముద్ర దొంగల దాడిలో గాయపడిన జాలర్లు

అడయార్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తమిళ జాలర్లపై శ్రీలంక సముద్ర దొంగలు దాడి జరిపారు. జాలర్లు వేటాడిన చేపలతో పాటు వారి సామగ్రిని దోచుకెళ్లారు. నాగపట్టినం జిల్లా నంబియార్ నగర్‌కు చెందిన విఘ్నేష్, విమల్, సుకుమార్ , తిరుమురుగన్, మురుగన్, అరుణ్ సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. కోడిక్కరైకు తూర్పు దిక్కున వేట కొనసాగిస్తుండగా, ఒక్కసారిగా వచ్చిన సముద్ర దొంగలు వారిని చుట్టుముట్టి దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు జాలర్లు గాయపడ్డారు. సుజుకి ఇంజిన్, సెల్‌ఫోన్, జీపీఎస్, లైట్ బ్యాటరీ, వాకీటాకీలను తీసుకెళ్లిపోయారు. అదేవిధంగా మరో ఫైబర్ బోటులో వెళ్లిన ఐదుగురిపై దాడి చేసి, వారి నుంచి అనేక విలువైన సామాగ్రిని దోచుకెళ్లారు.

ద్వితీయ మావటీల గ్రామం

● ప్రారంభించిన సీఎం స్టాలిన్



చెన్నై, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా ఆనమలై పులుల అభయారణ్య ప్రాంతం ఆనమలై సమీపంలోని కోళికముత్తి ఏనుగుల శిబిరం వద్ద ద్వితీయ మావటీల గ్రామాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ఉదయం ప్రారంభించారు. చెన్నై సచివాలయంలో పర్యావరణం, వాతావరణ మార్పులు, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో మావటీలు, సిబ్బంది కోసం రూ.5.40 కోట్లతో నిర్మించిన నివాస గృహాలతో రూపొందించిన దేశంలోనే ద్వితీయ మావటీల నగరానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఆ ప్రాంతం వద్ద ఏనుగులను సంరక్షిస్తున్న ఆరుగురికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. ముదుమలై పులుల సంరక్షణ కేంద్రంలో ఉన్న తెప్పకాడులో దేశంలోనే మొట్టమొదటి మావటీల గ్రామాన్ని మే 13న స్టాలిన్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే కోళికముత్తి ఏనుగుల శిబిరం వద్ద నివాస సదుపాయం, కనీస వసతులతో రెండో మావటీల నగరాన్ని రూపొందించారు. ఆ శిబిరం వద్ద గిరిజన కులాలకు చెందిన మావటీలు వంశపారంపర్యంగా కులవృత్తిలా ఏనుగులను సంరక్షిస్తున్నారు. ఈ కొత్త మావటీల గ్రామంలో రూ.3.50 కోట్లతో సూర్యశక్తితో పనిచేసే విద్యుత్ సరఫరాని కూడా నెలకొల్పారు. ఆ శిబిరం వద్ద నివసించే 47 మంది మావటీ కుటుంబ సభ్యులు బసచేసే ఇళ్లకు నిర్విరామంగా విద్యుత్ సరఫరాను కూడా అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆర్ఎస్ రాజకన్నప్పన్, పర్యావరణం, వాతావరణ మార్పులు, అటవీశాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహు, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆనమలై సమీపంలో ద్వితీయ మావటీల గ్రామాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

తిరుమలలో నేడు పున్నమిగరుడసేవ

తిరుమల, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం పున్నమి గరుడసేవ జరుగనుంది. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 28న గరుడవాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు పదిరోజుల వ్యవధిలోనే మరోసారి గరుడునిపై కొలువుదీరి దర్శనమివ్వనున్నారు. మంగళవారం రాత్రి7 నుంచి 9గంటల నడుమ ఊరేగింపు జరుగుతుంది.

ఘాట్‌లో అదుపుతప్పిన జీపు

● ఎనిమిది మందికి గాయాలు

తిరుమల, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో సోమవారం ఓ జీపు అదుపుతప్పి క్రాష్‌బారియర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో ఎనిమిదిమంది గాయపడ్డారు. తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని జీపులో తిరుపతికి వసమ్తుండగా 24వ మలపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. జీపులోని నలుగురు హిందూపురం భక్తులు, ఇద్దరు ఒడిస్సా రాష్ట్రవాసులు, ఓ తమిళ భక్తుడితో పాటు తిరుపతికి చెందిన డ్రైవర్ గాయపడ్డారు.వీరిని 108 అంబులెన్స్ ద్వారా తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.





ప్రమాదానికి గురైన జీపు - ప్రమాదానికి గురైన జీపు, డ్రైవర్



అంబులెన్స్‌లో క్షతగాత్రులు


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ దాటి బాటగంగమ్మ ఆలయ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.89 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 83,412

తలనీలాలు సమర్పించినవారు: 33,058



నాన్ మెడికల్ నియామకాలపై మౌనమేల?

● 15నుంచి ఇంటర్వ్యూలకు కసరత్తు

● కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు ● నాన్ మెడికల్ అభ్యర్థులకు నో కాల్

తిరుపతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని స్విమ్స్‌లో ఫ్యాకల్టీ నియామక ప్రక్రియపై ఎంపిక కమిటీ కసరత్తు మొదలుపెట్టింది. నోటిఫికేషన్‌లోని 104 పోస్టులకుగాను 315 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి సుమారు 210 మందికి కాల్ లెటర్లు పంపినట్టు తెలిసింది. ఈనెల 15నుంచి 17వరకు రోజుకు 70 మంది చొప్పున ఇంటర్వ్యూకు పిలిచినట్టు సమాచారం. అయితే నాన్ మెడికల్ అభ్యర్థులకు కాల్ లెటర్లు అందలేదు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ వంటి నాన్-మెడికల్ పోస్టులకు ఇదేవిభాగాలకు సంబంధించి స్విమ్స్ వర్సిటీలోనే పీజీ, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులను పక్కనపెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే, డెంటిస్ట్రీలోని ఓరల్ అండ్ మాక్సిల్లోఫేసియల్ సర్జరీ పోస్టుపై వచ్చిన ఆరోపణలపై వాటిని తాత్కాలికంగా హోల్డ్‌లో పెడుతున్నట్టు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మీడియా అడిగితే చెప్పారు కానీ అధికారిక వెబ్‌సైట్‌లోనూ, అధికారిక ప్రకటనగానూ విడుదల చేయలేదు. దీని వల్ల అభ్యర్థుల్లో అనుమానాలు మరింత పెరిగాయి.

గతంలోనూ ఇలా...

2023 నియామకాల సమయంలోనూ ఇదే పరిస్థితి చోటు చేసుకుంది. అప్పట్లో నాన్-మెడికల్ ఫిజియాలజీ పోస్టుపై కోర్టు ఆదేశాలు వచ్చినప్పటికీ, స్విమ్స్ ఆ పోస్టును మాత్రమే నిలిపివేసి మిగతావన్నీ భర్తీ చేసింది. అప్పట్లో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ అర్హతలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చినా, అమల్లో మాత్రం ఎంబీబీఎస్, ఎండీ ఆధారిత అభ్యర్థులకే ప్రాధాన్యమిచ్చారు. తాజా నోటిఫికేషన్‌లో ఎమ్మెస్సీ పీహెచ్‌డీ అర్హతలను పూర్తిగా నిరాకరించడం అభ్యర్థుల్లో నిరాశ, అభ్యంతరాలు రేపుతోంది. ఒక వైపు నియామకాలను వేగంగా నడిపిస్తూ, మరో వైపు కీలక విషయాల్లో స్పష్టత ఇవ్వకుండా ఉండటం వల్ల స్విమ్స్‌లో ద్యుయల్ మేనేజ్‌మెంట్ కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాన్ మెడికల్ అంటే ఎందుకంత చిన్నచూపు

ఎండీ చేసిన అభ్యర్థి స్విమ్స్‌లో అడహక్ కింద చేరిన ఏడాదికే పర్మినెంట్ అయిపోతున్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో ఓ సీనియర్ స్టాటిస్టీషియన్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదా ఇవ్వకుండా అడ్డంకులు పెడుతున్నట్టు తెలుస్తోంది. పీహెచ్‌డీ చేసిన సదరు స్టాటిస్టీషియన్‌కు ఎన్ఎంసీ నిబంధనల మేరకు అర్హత ఉన్నప్పటికీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించడంలేదు. దీనిపై ఆమె అలుపెరగని పోరాటం చేస్తున్నారు. స్టేట్ యాక్ట్‌తో నడుస్తున్న స్విమ్స్ సంస్థ యాజమాన్యం ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టాలనుకోవడం సరికాదని అభ్యర్థులు వాపోతున్నారు.

‘బెల్టు’ తీస్తున్నారు

● అక్రమ మద్యంపై ఉక్కుపాదం ● నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

● ఆర్నెళ్లలో వందకుపైగా కేసుల నమోదు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు దుకాణాల కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. ఏమాత్రం తేడా వచ్చినా అధికార యంత్రాంగం ఉక్కు పాదం మోపుతోంది. ఎంఆర్‌పీ ధరకు మించి విక్రయించినా, గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసినా, నాసిరకం అంటగట్టినా జరిమానాలతో సరిపెట్టకుండా లైసెన్సులు రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈక్రమంలోనే జిల్లాలో గడచిన ఆరు నెలల్లో ఎక్సయిజ్ అధికారులు సుమారు వందకు పైగా కేసులు నమోదు చేశారు. జిల్లాలో 11 ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో తిరుపతి, తిరుపతి రూరల్, పరిధిలో అత్యధిక షాపులున్నాయి. అన్ని సర్కిళ్లలో ప్రత్యేక టీముల అధికారులు అమ్మకాల తీరుపై ప్రత్యేక నిఘా పెట్టారు. మద్యం దుకాణాలతో పాటు ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన బార్లలోనూ తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఏ పరిస్థితుల్లోనూ రాజీ పడరాదనే సీఎం ఆదేశాలను తూ.చా.తప్పకుండా క్షేత్ర స్థాయిలో అమలు చేస్తున్నారు. ప్రధానంగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటుసారా, కల్లు, ఇతర మత్తు పదార్థాలు పొరుగురాష్ట్రాల నుంచి రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. బెల్టు షాపులపైనా సగటున నెలకు 20 కేసులు నమోదు చేస్తున్నారు. ఎంఆర్‌పీ ధర ఉల్లంఘనలు అతిక్రమించకుండా ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం నాణ్యత పరిశీలనకు 13 పారామీటర్లను అనుసరిస్తున్నారు.

ఎవ్వరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదు



నాసిరకం మద్యం, బెల్టు షాపుల విషయంలో కఠినంగా ఉంటున్నాం. నిరంతర నిఘా పెట్టాం. ఎంఆర్‌పీ ధరలకు మించి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులందితే సీరియస్‌గా పరిగణిస్తున్నాం. ఇప్పటికే మద్యం దుకాణాల యజమానులకు మార్గదర్శకాలు జారీ చేశాం.. డిపో నుంచి వచ్చిన మద్యం, దుకాణాల్లో బాటిళ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ఒకటికి రెండు సార్లు చెప్పిగా వినకపోతే షాపుల లైసెన్సుల రద్దుకు వెనుకాడేదిలేదు

- నాగమల్లేశ్వర రెడ్డి,జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

పీజీఆర్ఎస్‌కు 276 వినతులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

● అత్యధికం రెవెన్యూ శాఖవే

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 276 వినతులు వచ్చాయి. అందులో అత్యధికంగా 157 రెవెన్యూ శాఖకు సంబంధించినవే వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేశారు. ప్రతి అర్జీనీ సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ అధికారిపై చర్యలు తీసుకోండి

సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల గురించి అసభ్యంగా మాట్లాడిన జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డిని విధుల నుంచి తొలగించి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బహుజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మాధవ్, నాయకులు వెంకయ్య, సూర్య, కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పీహెచ్‌డీ ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

● దరఖాస్తుకు 21వ తేదీ గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2024-25 పేర ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు.ఏపీఆర్‌సెట్-2024-25 నిర్వహణ బాధ్యతను పద్మావతి మహిళా యూనివర్సిటీకి ప్రభుత్వం అప్పగించింది. దరఖాస్తుకు ఈనెల 21వ తేదీ చివరి గడువు విధించారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.1000, బీసీలకు రూ.1300, ఓసీలకు రూ. 1500 దరఖాస్తు రుసుం నిర్ణయించారు. నవంబరు 3నుంచీ 7వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 14 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఏపీఆర్‌సెట్-2024-25 కన్వీనర్ ప్రొఫెసర్ ఉష, కో-కన్వీనర్ ప్రొఫెసర్ జాన్ సుష్మ తెలిపారు.

‘ఎర్ర’స్మగ్లర్‌కు మూడేళ్ల జైలుశిక్ష : రూ.20వేల జరిమానా

తిరుపతి(నేరవిభాగం)/పిచ్చాటూరు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. నారాయణవనం మండలం ఇరకంబట్టు గ్రామానికి చెందిన టి.సురేష్ 2015లో కేవీబీపురం మండల పరిధిలోని నిషేధిత రిజర్వు ఫారెస్టులోకి చొరబడి ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలిస్తుండగా పిచ్చాటూరు పోలీసులు అరెస్టు చేశారు.కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.పదేళ్లుగా విచారణలో ఉన్న ఈ కేసును ఇటీవల తిరుపతి ఎర్రచందనం కోర్టుకు మార్చారు. పోలీసులు సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించడంతో న్యాయమూర్తి జైలుశిక్షతోపాటు జరిమానా విధించారు. ముద్దాయిని చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు.



ముద్దాయిని సబ్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

టీడీపీ నేతపై వైసీపీ సర్పంచ్ దౌర్జన్యం

● నీటిపారుదలశాఖ అధికారుల సాక్షిగా దాడికి యత్నం

● బాధితుడు వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్

తడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల బరితెగింపు దాడులు ఆగడం లేదు. సాక్ష్యాత్తు నీటిపారుదలశాఖ అధికారుల సాక్షిగా టీడీపీ నేతపై వైసీపీ సర్పంచ్ దాడికి దిగిన ఘటన తడ మండలంలో సోమవారం జరిగింది. మండలంలోని పూడి చెరువు మరమ్మతులు చేయాలని నీటిపారుదలశాఖ అధికారులు నిర్ణయించారు. ఆ శాఖ ఈఈతో పాటు ఏఈల కూడిన అధికారుల బృందం సోమవారం మధ్యాహ్నం చెరువును పరిశీలించింది. వారితో పాటు వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవి సెల్వం కూడా ఉన్నారు. అదే సమయంలో వైసీపీ నాయకుడు, పూడి సర్పంచ్ ఓబులాపురం పరమశివం కుమారులు విశ్వనాథన్, శివకుమార్ అక్కడకు వచ్చి కొలవి సెల్వంతో గొడవకు దిగారు. బూతులు తిడుతూ దాడి చేశారు. దీంతో బిత్తరపోయిన సెల్వం కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న గ్రామస్తులు వచ్చి దాడిని అడ్డుకున్నారు. ఈదంతా చూస్తున్న అధికారులు నిశ్చేష్టులై నిలబడిపోయారు. ఈ ఘటనపై బాధితుడు సెల్వం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాతకక్షలను దృష్టిలో ఉంచుకొని తనపై అకారణంగా దాడిచేసి కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



గల్లంతైన బాలుడు కోసం పులికాట్‌లో గాలిస్తున్న మత్స్యకారులు



విషాదంలో యువకుడి బంధువులు

పడవలో నుంచి జారి..

పులికాట్ సరస్సులో బాలుడి గల్లంతు

● తీవ్రంగా గాలిస్తున్న మత్స్యకారులు

తడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సులో పడవలో వెళ్తున్న ఓ బాలుడు అదుపుతప్పి నీళ్లలో పడి గల్లంతయ్యాడు. తడ మండలం ఇరకందీవికి చెందిన తెరిగిపి ఆర్ముగం కుటుంబం తమిళనాడు ఎన్నూరుకుప్పం గ్రామానికి వెళ్లి అక్కడే నివాసం ఉంటోంది. పెరటాసి నెల 3వ శనివారం నాడు కుటుంబంతో సహా గ్రామానికి వచ్చారు. సోమవారం ఉదయం తమిళనాడులోని సున్నాంబకులం వెళ్లేందుకు ఆర్ముగం తన మనవడు తెరిగిపి హేమరాజ్(17) కలిసి పడవలో బయలుదేరారు. పులికాట్ సరస్సులో కొంత దూరం వెళ్లాక అల్లల ఉధృతికి పడవ అటు ఇటు ఊగడంతో అంచుపై కూర్చున్న హేమరాజ్ అదుపుతప్పి నీళ్లల్లో పడిపోయాడు. పడవలో ఉన్న ప్రయాణికులు గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో ఇరకందీవి గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో మత్స్యకారులు పడవల్లో బయలుదేరి ఘటనాస్థలికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు కూడా ఘటనాస్థలికి వెళ్లారు. రాత్రి వరకు గాలించినా హేమరాజ్ ఆచూకీ దొరకలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు ఆపేసి.. మంగళవారం ఉదయం మొదలు పెట్టనున్నారు.

మద్యంతాగి.. కత్తితో వీరంగం

● తిరుపతిలో ఇద్దరిని అరెస్టు చేసి.. వీధిలో నడిపించుకుంటూ వెళ్లిన పోలీసులు



చేతిలో కత్తి పెట్టుకుని వీరంగం చేస్తున్న ఫిరోజ్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రౌడీ కల్చర్ కోరలు చాచింది. ఓ రౌడీ మద్యం మత్తులో కత్తితో వీరంగం చేస్తూ నడిరోడ్డుపై సోమవారం జనాలను భయభ్రాంతులకు గురిచేశాడు. ఇతడితోపాటు ప్రత్యర్థినీ పోలీసులు అదుపులోకి తీసుకుని వీధిలో నడిపించుకుంటూ తీసుకెళ్లారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తిరుపతి నగరం ఎస్టీవీ నగర్‌కు చెందిన ఫిరోజ్, సయ్యద్ బాషా కొన్నేళ్లుగా పాత కక్షలున్నాయి. గతంలో వీరిద్దరూ కత్తులతో పొడుచుకుని హత్యాయత్నాలకు పాల్పడ్డారు. జైలుకూ వెళ్లి వచ్చారు. ఫిరోజ్ రౌడీలా తిరుగుతూ, స్నేహితులతో గలాటాలకు దిగి బెదిరించడం పరిపాటిగా మారింది. ఇతడిపై దాదాపు 19 కేసులు ఉన్నాయని, ఇది వరకే రౌడీ షీట్ నమోదై ఉందని ఈస్ట్ సీఐ శ్రీనివాసులు చెప్పారు. అడ్డగోలు సంపాదనకు అలవాటు పడ్డ సయ్యద్ బాషా, ఫిరోజ్ మధ్య ఆర్థిక లావాదేవీలు, ఇతర వ్యవహారాల్లో తీవ్ర గొడవలున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఎస్టీవీ నగర్‌లోని విక్టరీ వైన్స్ వద్ద ఫిరోజ్ మద్యం తాగి, చేతిలో కత్తి పెట్టుకుని వీరంగం చేశాడు. బాగా తెలిసిన వారికి కత్తి చూపిస్తూ భయభ్రాంతులకు గురిచేశాడు. అదే షాపు వద్ద సయ్యద్ బాషా కూడా మద్యం తాగుతున్నాడు.ఈ క్రమంలో ఫిరోజ్ వీడియోలు సోషల్ మీడియాల్లో వైరల్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాలతో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది అక్కడికి వెళ్లారు. నడి రోడ్డుపై కత్తి పెట్టుకుని వీరంగం చేస్తున్న ఫిరోజ్‌ను, అక్కడే ఉన్న సయ్యద్‌బాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ఎస్టీవీ నగర్‌లో జరిగిన రెండు ఘటనల్లోనూ ఫిరోజ్ హస్తం ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కాగా, ఫిరోజ్, సయ్యద్‌బాషాపై ఆర్మ్స్ యాక్టు కింద కేసు నమోదు చేసి ఈస్ట్ స్టేషన్ నుంచి వీధుల్లో నడిపించుకుంటూ కోర్టు వద్దకు తీసుకెళ్లారు. న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ శ్రీనివాసులు చెప్పారు. గత కొంత కాలంగా పోలీసుల రికార్డుల్లోకెక్కిన రౌడీల పట్ల పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడం, వారి కదలికలపై నిఘా ఉంచి చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా వీరిపట్ల కఠిన వైఖరి అవలంబించాలని స్థానికులు కోరుతున్నారు.



నిందితులను రోడ్డుపై తీసుకెళుతున్న పోలీసులు

విద్యార్థులే భావి శాస్త్రవేత్తలు

● ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో షార్ డైరెక్టర్ పద్మకుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకుంటే ఇస్రోకు భావి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అన్నారు. సతీష్ థావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో సోమవారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారిని శాస్త్రవేత్తలుగా తీర్చి దిద్దేందుకు ఇస్రో ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగానే ఏటా అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాలు, వాటి పనితీరుపై అవగాహన కల్పించి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఏపీతో పాటు తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో కూడా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతరిక్ష ఫలాలు సామాన్యులకు సైతం అందేలా ఇస్రో కృషి చేస్తోందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పూణెలోని ఇంటర్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ రఘునాథన్ శ్రీఆనంద్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్సు రంగం పట్ల పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుంటే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. మన శాస్త్రవేత్తలు తక్కువ ఖర్చుతోనే చంద్రయాన్, మంగళయాన్, ఆదిత్యాఎల్ 1 వంటి ప్రయోగాలు చేపట్టడం దేశానికే ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెరియన్, షార్ కంట్రోలర్ జి.రమేష్ బాబు, అంతరిక్ష వారోత్సవాల కమిటీ చైర్మన్ శంబు ప్రసాద్, రేంజ్ ఆపరేషన్ డైరెక్టర్ ఎస్.సునీల్, ఎంఎస్‌ఏ డీడీ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్



చలపతిరావును శాలువా కప్పి ఆహ్వానిస్తున్న అధికారులు

స్మగ్లర్లు అడవుల్లోకి రాకుండా చర్యలు

అటవీ శాఖ అధికారులతో పీసీసీఎఫ్ చలపతిరావు

మంగళం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్మగ్లర్లు అడవుల్లోకి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్టు పీవీ చలపతిరావు అటవీ, టాస్క్‌ఫోర్సు అధికారులకు సూచించారు. తిరుపతి బయోట్రిమ్‌లో సోమవారం తిరుపతి, కర్నూలు సర్కిళ్ల అటవీశాఖ, ఏపీ టాస్క్‌ఫోర్సు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన ఏపీ టాస్క్‌ఫోర్స్, అటవీ శాఖ బలగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న దుంగలను ఎప్పటికప్పుడు గోదాములకు తరలించి, భద్రపరచాలన్నారు. ఎర్రచందనం సాగు, లోకల్ మార్కెట్‌లో విక్రయాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎర్రచందనం బొమ్మలు, ఇతర వస్తువుల తయారీ, మార్కెటింగ్ వంటి అంశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ సీసీఎఫ్ సెల్వం, కర్నూలు సర్కిల్ సీసీఎఫ్ కృష్ణమూర్తి, టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి తిరుపతి సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, డీఎఫ్‌వో పవన్‌కుమార్ రావు, ఎర్రచందనం గోదాము రవిశంకర్‌శర్మ, తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో కొండారెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ సహకార సదస్సు

● వివిధ రాష్ట్రాల నుంచి 80 మంది డెలిగేట్స్ రాక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తిరుపతి తాజ్ హోటల్ వేదికగా బుధవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సహకార రంగాల ఐఏఎస్ అధికారులు, ప్రతినిధులు హాజరుకానున్నారు. మంగళవారం డెలిగేట్స్ తిరుపతికి చేరుకోనున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ హాజరుకానున్నారు. ఆయా రాష్ట్రాల్లోని సహకార రంగంలో అమలవుతున్న సంస్కరణలు, వివిధ అంశాలపై ఎగ్జిబిషన్ ఉంటుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జాతీయ సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్‌బూటానీ, జాయింట్ సెక్రటరీ సిద్ధార్థజైన్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ పర్యవేక్షణలో ఈ సదస్సు జరుగుతుంది.

9నుంచి ఎస్వీయూ ఇంటర్ కాలేజీ గేమ్స్‌కు ఎంపిక

తిరుపతి(క్రీడలు), అక్టోబర్ 6(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంటర్ కాలేజీ మెన్ అండ్ ఉమెన్ గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎస్వీయూ వ్యాయామ విభాగాధిపతి ఎం.శివశంకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. 9న బాక్సింగ్, జూడో, కరాటే, తైక్వాండో, సాఫ్ట్‌బాల్, బాస్కెట్‌బాల్ పురుష క్రీడాకారుల ఎంపిక, 14, 15 తేదీల్లో బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, హాకీ, క్రికెట్‌కు సంబంధించి మహిళా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఎస్వీయూలో జరుగుతాయని వెల్లడించారు. 17, 18 తేదీల్లో ఫుట్‌బాల్, హాకీ, బాల్‌బ్యాడ్మింటన్ పురుష క్రీడాకారుల ఎంపిక పోటీలు ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాలలో ఉంటాయని పేర్కొన్నారు. 22, 23 తేదీల్లో ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్ పురుష క్రీడాకారుల ఎంపిక పోటీలు ఎస్వీయూలో నిర్వహిస్తారని తెలిపారు. 29, 30 తేదీల్లో చెస్, బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పురుష క్రీడాకారుల ఎంపిక పోటీలు మదనపల్లెలోని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ మైదానంలో జరుగుతాయన్నారు. నవంబర్ 4, 5తేదీల్లో మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలకు సంబంధించిన ఎంపిక పోటీలు ఎస్వీయూలో, అదేనెల 18న మెన్ క్రికెట్ పోటీలు ఎస్వీయూ మైదానంలో ఉంటాయని తెలిపారు. చివర్లో ఎస్వీయూ ఇంటర్ కాలేజీ మెన్ అండ్ ఉమెన్ స్టాఫ్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వివరించారు.